# కొడి

## వి.వి.బి

మబ్బులు చిక్కబడి నల్లగా పగలే చీకటయిపోయింది. ఏదో అసంతృప్తి. ఏదో ఆరాటం. ఎందుకో దిగులు. చిరాకు. నెత్తిన పొగలా ఆవరించుకు వస్తోంది.

"పెదనాన్నా! నే వెళుతున్నా!"

శాస్త్రి జవాబు చెప్పలేదు. ఒక్క క్షణం అక్కడే నుంచుని ఏమనుకున్నాడో ఏమో భాస్కరం "దొడ్డమ్మా, నాకు టైమయిపోయింది, నే వెళుతున్నా!" అని లోపలకి కేకేసి స్కెత్ మడిచి ఓవర్ ఆల్ జేబులో ఉంచుకుని బయలుదేరిపోయాడు.

-"ఏమిటీ అలా ఉన్నారు... కాస్త కాఫీ తెచ్చి ఇవ్వనా?" రాజ్యం భర్తని చూసి అడిగింది.

శాస్త్రి పడక కుర్చీలో జేరబడి గుండెలమీద దినపత్రిక పడేసుకుని శూన్యంలోకి చూస్తున్నాడు.

"ఏమైందండీ... కాఫీ కావాలా అని అడిగాను... భాస్కరం వెళుతూ చెబితే వినిపించుకోలేదే?"

"బ్రతుక్కి అర్థం ఏమిటా అని ఆలోచిస్తున్నాను."

"భలేవాళ్లే! అంత సులువుగా అర్థమయితే అది బ్రతుకెందుకవుతుందీ - ఇంతకీ మీ మనసు ఒకరోజు సరిగా ఉంటే నాలుగు రోజులు సరిగా ఉండదు - అదంతే! ఆలోచనకందని విషయాల్ని అలా వదిలెయ్యడమే!"

"మనవాళ్ళు..." ఏదో చెబుదామనుకున్నా మరి శాస్త్రికి మాట ముందుకు సాగలేదు.

నెత్తిన బాధ్యతలు వేసుకోడం - తీరా వేసుకున్న తరువాత ఎందుకు వేసుకున్నానా అని వాపోవడం సుమారు అలవాటుఅయిపోయింది.

మంచి చేస్తూ మంచే ఎందుకు చెయ్యాలి అనే ఆలోచన వచ్చి అతని మనసుని కలవరపెడుతుంది.

కాఫీ గ్లాసుతో వచ్చింది రాజ్యం. అతను కాఫీ తాగడం అయ్యాక 'ఇక స్నానానికి లేస్తారా?" అంది.

"మనవాళ్లకి మనం చెయ్యాలనుకున్నా చెయ్యలేకపోయాం. క్షణికమైన ఉద్రేకంతో నెత్తిన బరువులు వేసుకున్నాం. బాధ్యతలూ, బరువులూ లేకుండా సుఖ జీవితం గడపాలని ఎవరయినా అనుకుంటారు. కాని మనమూ ఉన్నాం చూడు. లేనిపోని ఊరుతంటాలు నెత్తిన వేసుకుని వాపోస్తూ ఉంటాం."

"అంటే మళ్లీ భాస్కరం గురించేనన్నమాట ఆలోచనంతా... మనవాళ్లకి చదువులు ఎలానూ అబ్బలేదు. వాడొక్కడే మన ఇంటిలో ఉన్నా ఒబ్బిడిగా చదువుకుంటున్నాడు. వాడికోసం నేనేమీ ప్రత్యేకంగా అలసిపోవడంలేదు. నలుగురిమధ్య వాడికో పిడికెడు మెతుకులు..."

"ఇవన్నీ ఎప్పుడూ ఉన్నవే. మరి నాకు చెప్పకు!"

"ఏం, ఎందుకు చెప్పకూడదు? మీకు చిరాకు పుట్టినప్పుడల్లా వాడిమీద చిందులేస్తారెందుకు? ఎలానూ నాలుగేళ్లయిపోయాయి. ఇంకొక్క సంవత్సరం మీరు చిచ్చుపెట్టకుండాఉంటే మన వాళ్లలో ఒకడు డాక్టరవుతాడు."

"అవుతాడు, అవుతాడు. అయి నీ నెత్తిన కిరీటం పెడతాడు. వాళ్లమ్మ, నాన్నా, ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటూ, కానీ పరకా వెనకేసుకుంటున్నారు. బిడ్డని కానీ ఖర్చు లేకుండా మన ఇంట్లో వదిలేసి రేపు వాడు పెద్దయ్యాక అదంతా వాళ్ల ప్రయోజకత్వం అనుకుంటారు. రేపు మనం వాళ్ల కంటికి ఆనం..."

"వాళ్ల కంటికి మనం ఆనకపోతేనేం. అందరినీ చూచే దొడ్డ కన్ను ఒకటి ఉండనే ఉంది. ఆ సూర్యనారాయణమూర్తి గంపంత కన్నుతో అందరినీ చూస్తూనే ఉన్నాడు... ఆరంభించరు నీచమానవులు..."

"అవు! ఆ పద్యం నాకు కంఠతా వచ్చేసింది." దిగ్గున లేచి అక్కడనుంచి వెళ్లిపోయాడు శాస్త్రి.

-"లే నాయనా, పొద్దున్న తిన్న మెతుకులు... ఎక్కడా ఏమీ తినవు..." భాస్కరాన్ని పిలవడం శాస్త్రి చెవిన పడింది.

"ఆఁ! ఇంటికి వచ్చేసరికి అమర్చిపెట్టడానికి ఉన్నావుగా... కానీ ఖర్చు లేదు. ఈ డబ్బు ఎక్కడ నుంచి వస్తోందన్న ఆలోచనా లేదు..."

శాస్త్రి మొదలెట్టాడు.

"దొడ్డమ్మా, నే వెళుతున్నా!"

రాజ్యం కిక్కురుమనలేదు. రెండు రోజులు భార్యాభర్తలూ మాటాడుకోనూ లేదు.

-"వీడు రాలేదా?"

"వాడెవడు?"

"అదేనే భాస్కరం."

"ఎందుకొస్తాడు. ఉన్నన్నాళ్ళు కళ్లలో నిప్పులు పోసుకున్నారు" రాజ్యం కళ్లలో నీళ్ళు తిరిగాయి.

-"దొడ్డమ్మా... పెదనాన్నను రేపు మా ప్రొఫెసర్ దగ్గరకు తీసుకెళతాను. ఆయన రక్తపుపోటు పరీక్ష చేస్తామన్నారు..." భాస్కరం గొంతు వినపడింది.

"చూశావా. నా డబ్బు తిని, నీచేత చాకిరీ చేయించుకుని నాకు రక్తపుపోటని..." ఇంకా ఏమేమో అనాలనుకున్నాడు శాస్త్రి. కాని భార్య వంక చూసి ఆగిపోయాడు. ఆమె ఒత్తికి కట్టిన కొడి చేతితో నలిపేస్తోంది. □

